క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామారావు

నెల్లిమర్ల: పారిశుద్ధ్య పనుల నిర్వహణపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ జి. రామారావు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని కాలువలు శుభ్రంగా ఉండేటట్లు చూడాలన్నారు. అలాగే తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కె. సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ తగదు

- సీఐ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

పూసపాటిరేగ: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని భోగాపురం రూరల్ సీఐ బి. వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెడు అలవాట్లకు లోనుకాకుండా క్రమశిక్షణతో మెలిగి భవిష్యత్‌కు బంగారుబాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పూసపాటిరేగ ఎస్సై ఆరంగి సన్యాసినాయుడు, ప్రిన్సిపాల్ పి. పైడిరాజుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి


- ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుశాంత్‌కుమార్ బెహరా



అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

పూసపాటిరేగ: ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లయితే ప్రాణనష్టం నివారించవచ్చునని ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుశాంత్‌కుమార్ బెహరా అన్నారు. మండలంలోని కందివలసలో గల ఎస్ఎంఎస్ పరిశ్రమలో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాలు, భూకంపాలు, తుఫాన్‌లు, వరదలు సంభవించినప్పుడు ప్రమాద ఉధృతి పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాద పరిస్థితుల్లో ఉన్నవారికి మనోధైర్యం ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఫైర్ ప్రతినిధి గణేష్‌కుమార్, పరిశ్రమ ప్రతినిధులు కరుణ్‌కుమార్, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.1.50 లక్షల విరాళం



నగదు అందజేస్తున్న ముల్లు రమణ

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయానికి దుర్గామల్లేశ్వర సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు ముల్లు రమణ, రమాదేవి దంపతులు రూ.1.50 లక్షలు విరాళం ప్రకటించారు. ఈమేరకు పట్టణంలోని తన నివాసం వద్ద ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు సోమవారం నగదు అందజేశారు. ట్రస్టు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణుమూర్తి, ఒమ్మి రమేష్, గుడ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు.

నేత్ర శస్త్రచికిత్సకు 51 మంది ఎంపిక

మెరకముడిదాం: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గర్భాం పీహెచ్‌సీలో సోమవారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి చెందిన ఆప్తాలమిక్ జాక్సన్ 103 మందికి నేత్రపరీక్షలు చేసి 51 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి శంకర్‌ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్‌లు చేయిస్తామని క్యాంపు సమన్వయకర్త సీహెచ్.అశ్వనీకుమార్ తెలిపారు. పీహెచ్‌సీ ఈఓ మురళి, హెచ్‌వీ నాగలక్ష్మి, నర్సింగ్‌స్టాఫ్ ఉష తదితరులు పాల్గొన్నారు.

మరో ఆరు రోజులే గడువు..



నగరంలోని భవన సముదాయాలు

- మొదటి అర్థ సంవత్సరం పన్ను చెల్లించేందుకు దగ్గరపడిన గడువు
- జూలై 1 నుంచి వడ్డీతో కలిపి చెల్లించాల్సిందే
- అర్థ సంవత్సరం ఆస్తి పన్ను డిమాండ్ రూ.14 కోట్లు... వసూలు రూ.9.48 కోట్లు

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లించేందుకు సమయం దగ్గరపడుతోంది. ఏడాదిలో మొదటి అర్థ సంవత్సరం పన్ను మొత్తం చెల్లించేందుకు ఈనెల 30తో గడువు ముగియనుంది. నెలాఖారులోగా మొదటి అర్థ సంవత్సరం పన్ను చెల్లించకుంటే వడ్డీ భారం తప్పదని అధికారులు పేర్కొంటున్నారు. అధికారిక లెక్కల ప్రకారం పన్ను చెల్లించేందుకు మరో ఆరు రోజులు మాత్రమే గడువు ఉండడంతో అధికారులు భవన యజమానులను అప్రమత్తం చేస్తున్నారు. గడువు ముగిసిన తర్వాత చెల్లించే వారికి నూటికి రూ.2 చొప్పున వడ్డీ భారం పడుతుందని స్పష్టం చేస్తున్నారు.

వాస్తవానికి ఆర్థిక సంవత్సరంలో రెండు దఫాలుగా మున్సిపల్ శాఖ ఆయా నగరాలు, పట్టణాల పరిధిలో గల భవన యజమానుల నుంచి పన్నులు వసూలు చేస్తుంది. ఇందులో భాగంగా మొదటి విడతగా జూన్ నెలాఖరు వరకు వసూలు చేస్తారు. రెండో విడతగా డిసెంబర్ నెలాఖరులోగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇలా రెండు విడతల్లో నిర్ణీత సమయానికి పన్ను చెల్లించని వారికి రెండు శాతం వడ్డీ విధిస్తారు. ఇందులో భాగంగా జూన్ నెలాఖరులోగా మొదటి అర్థ సంవత్సర పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అధికారిక లెక్కల ప్రకారం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 70 వేలకు పైగా అసెస్‌మెంట్లు ఉండగా... వాటి ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం పాత, కొత్త బకాయిలు కలిపి రూ.48 కోట్లకు పైగా ఆదాయం రావాల్సి ఉంది. అదేవిధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి అర్థ సంవత్సరానికి సంబంధించిన డిమాండ్ రూ.14 కోట్లు ఉండగా... ఇప్పటివరకు రూ.9.48 కోట్లు వసూలు చేసినట్లు అధికారిక లెక్కల వెల్లడిస్తున్నాయి. ఈ లెక్కన మరో 4.52 కోట్ల రూపాయలు వసూలు కావాల్సి ఉంది.

మొండి బకాయిలపై దృష్టి సారించేనా..

గత ఆర్థిక సంవత్సరంలో ఆశించిన స్థాయిలో పన్నులు వసూలు జరిగినప్పటికీ 2023 – 24 ఆర్థిక సంవత్సరంతో పాటు గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో పేరుకుపోయిన మొండి బకాయిల వసూళ్లలో యంత్రాంగం విఫలమవుతోంది. దీంతో ఆస్తి, నీటి పన్నులతో పాటు ఖాళీ స్థలాల నుంచి వసూలు కావాల్సిన మొత్తం రూ.కోట్లలో బకాయిలు ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. పేరుకుపోయిన బకాయిలు రాబడితే నగరంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుంది.

పన్నులు చెల్లించడం బాధ్యత

2024–25 ఆర్థిక సంవత్సరానికి భవనాలు, నీరు, ఖాళీ స్థలాలకు సంబంధించి పన్నుల వసూళ్లపై ప్రజలకు అవగాహన కల్పించాం. ఈ నెలఖరులోగా మొదటి అర్థ సంవత్సరం పన్ను మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో వడ్డీ భారం తప్పదు. ఈ విషయంపై యజమానులకు నోటీసులు జారీ చేశాం. కొంతమంది పన్నులు చెల్లించేందుకు నిరాసక్తత చూపించారు. ప్రజలంతా సహకరించి పన్నులు చెల్లించడం ద్వారా నగర అభివృద్ధికి సహకరించాలి.

– ఎం.మల్లయ్యనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

మలేరియా రహిత సమాజ స్థాపనకు కృషి



ర్యాలీ చేస్తున్న పూసపాటిరేగ పీహెచ్‌సీ సిబ్బంది

- డాక్టర్ రాజేష్‌వర్మ

పూసపాటిరేగ: మలేరియా రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి రాజేష్‌వర్మ అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమల ద్వారా వచ్చే వ్యాధుల నియంత్రణకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వారానికి ఒకసారి నీటి నిల్వలు, పాత్రలు ఖాళీ చేసి డ్రై డేగా పాటించాలని సూచించారు. విజయనగరం సబ్‌యూనిట్ మలేరియా నివారణ అధికారి గోవిందరాజు మాట్లాడుతూ.. రోజు విడిచి రోజు జ్వరం, తలనొప్పి, వణుకుతో కూడిన చలి రావడం, చెమటలు పట్టడం మొదలగు లక్షణాలు ఉన్న వ్యక్తులు వెంటనే పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వేదమణి, హెల్త్ ఎడ్యుకేటర్ మహేశ్వరి, సూపర్‌వైజర్లు ఉమాపతి, నానమ్మ, ఆరోగ్య సహాయకులు బంగారుబాబు, ఆర్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

మంచి పాలనకు సహకరించండి

- నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో నెల్లిమర్ల నగర పంచాయతీలో మంచి పాలన అందించడానికి అధికారులు సహకరించాలని ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని కోరారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగర పంచాయతీకి చెందిన పలువురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇంటి పన్నులు, ప్లాన్‌ల పేరిట వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇకపై అలా జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఏ పనికైనా లంచాలు డిమాండ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్లు అవనాపు సత్యనారాయణ, కల్యాణం సత్యనారాయణ, మొయిద శ్రీనివాసరావు, కింతాడ కళావతి, తదితరులు పాల్గొన్నారు.

నియామకం..



అచ్చిరెడ్డికి నియామకపత్రంతో పాటు సమాజ సేవారత్న పురస్కారం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ జిల్లా అధ్యక్షుడిగా విజయనగరానికి చెందిన డాక్టర్ ఎస్.అచ్చిరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు విశాఖలో ఐహెచ్ఆర్‌సీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు జాతీయ అధ్యక్షుడు రాజాన ప్రసాదరావు నియామకపత్రం అందజేశారు. అనంతరం సమాజ సేవారత్న పురస్కారంతో సత్కరించారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు

- ప్రజా విజయం పార్టీ వ్యవస్థాపకుడు షణ్ముఖరావు

విజయనగరం ఫూల్‌బాగ్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా ప్రజా విజయం పార్టీని ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపకుడు పి. షణ్ముఖరావు తెలిపారు. సోమవారం స్థానిక ప్రజా గ్రంథాలయంలో పార్టీ ఏర్పాటు, పార్టీ విధివిధానాలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను కల్పించడమే పార్టీ ప్రధాన అజెండా అని తెలిపారు. చెన్న బంగారురాజు మాట్లాడుతూ.. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు సుపరిపాలన అందించే విధంగా ప్రజా విజయం పార్టీ కృషి చేస్తుందన్నారు. మేధావి వర్గాల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. అనంతరం పార్టీ కార్యవర్గాన్ని ప్రకటించారు. పార్టీ అధ్యక్షుడిగా షణ్ముఖరావు, ప్రధాన కార్యదర్శిగా బంగారురాజు, కార్యవర్గ సభ్యులుగా మన్మధరావు, సాంబమూర్తి, భాస్కరరావు, రమణ, టీవీ దుర్గారావు, పప్పు విశ్వనాథం, విజయబాబు, ఈఎస్ఎన్ రాజు, కె. విశ్వనాథం, బంగారు దుర్గారావు ఎంపికయ్యారు.

ఘనంగా బ్రదర్స్ డే



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, మెసానిక్ టెంపుల్ సభ్యులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని మెసానిక్ టెంపుల్ సంస్థ యూనివర్సల్ బ్రదర్స్ డే సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత హిందూ, ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, తదితర మత పెద్దలు, విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్ నుంచి మయూరి జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. వివిధ మతాల ధర్మాలను ఈ సందర్భంగా వివరించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గజపతినగరం: స్థానిక కేతలనగర్ కాలనీలో వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్మాణకర్తలు ఆంజనేయమూర్తి,రత్నకుమారి దంపతులతో వేదపండితులు స్వామివారి కల్యాణం వైభవంగా జరిపించారు. వందల సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం ఆల యం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

అనధికార వ్యక్తులపై చర్యలు తీసుకోండి

- అంబేడ్కర్ రైట్స్ ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు భానుమూర్తి



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: అనధికార వ్యక్తి సచివాలయంలోకి వచ్చి సంబంధిత ఉద్యోగులపై పెత్తనం చెలాయించడంపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ రైట్స్ ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొంగ భానుమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థలో ఫిర్యాదు చేశారు. పలువురు అర్జీదారులు పలు సమస్యలపై కమిషనర్ ఎంఎం నాయుడుకు వినతిపత్రాలు అందజేశారు. హౌసింగ్‌కు సంబంధించి ఒకటి, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రెండు, శానిటేషన్‌కు సంబంధించి రెండు, వలంటీర్ల రాజీనామాకు సంబంధించి రెండు వినతులు అందాయి. అలాగే 41వ డివిజన్ 49వ నంబర్ సచివాలయ పరిధిలో అనధికార సభ్యులు సచివాలయంలోకి ప్రవేశించి సిబ్బందితో సమీక్ష చేయడం విరుద్ధమని, ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని బొంగ భానుమూర్తి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏసీపీ అమ్మాజీరావు, ఈఈ కె. శ్రీనివాసరావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి చేస్తా..

- నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి



రైతులకు విత్తనాలు అందిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

డెంకాడ: రైతు సంక్షేమానికి ప్రణాళికాబద్ధంగా పని చేస్తానని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని డెంకాడ పీఏసీఎస్ వద్ద రైతులకు శనివారం వరి విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మన ప్రాంతంలో వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగు చేయడం వల్ల రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వర్షపు నీటిని నిల్వ చేసే సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణంపై దృష్టి సారిస్తానన్నారు. నియోజకవర్గానికి సాగునీరు అందించే రామతీర్థసాగర్ రిజర్వాయర్ పూర్తయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎగువ ప్రాంతాల నుంచే చెరువులకు నీరు ప్రవహించే గెడ్డలను, వాగులను ఆక్రమించే వారిపై చర్యలు తప్పవన్నారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ విధానంలో సాగు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కంది సూర్యనారాయణ, సర్పంచ్ పతివాడ గౌరి, ఎంపీటీసీ సభ్యురాలు కోరాడ కుమారి, ఏపీసీఎస్ఎఫ్ డీపీఎం ఎం.ఆనందరావు, ఏడీఏలు నాగభూషణం, ఆర్.అన్నపూర్ణ, ఏపీ సీడ్స్ డీఎం పద్మ, ఏఓలు టి.సంగీత, పూడి నిర్మల, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విత్తన కొరతను అధిగమించాలి

పూసపాటిరేగ: విత్తనోత్పత్తి ద్వారా విత్తన కొరతను అధిగమించవచ్చునని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రైతులకు విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల భూములు సారం తగ్గిపోతుందని, తద్వారా దిగుబడులు రావని చెప్పారు.

తిరుమలగెడ్డ, పాలవలస చానల్, చంపావతి కాలువల ద్వారా ఈ ఏడాది ముందుగానే రైతులకు సాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కొబ్బరిసాగుకు తెగుళ్లు పట్టడం వల్ల దిగుబడులు తగ్గుతున్నాయని.. ఉద్యానవన శాఖాధికారులు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రాధిక, తహసీల్దార్ ప్రవల్లికప్రియ, వ్యవసాయ అధికారులు కొల్లి నీలిమ, సంగీత, ప్రజాప్రతినిధులు మహంతి చిన్నంనాయుడు, ఎంవీజీ శంకరరావు, పతివాడ శ్రీనివాసరావు, బూర్లె శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, తదితరులు

అలవెన్స్‌లు చెల్లించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: మున్సిపల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, డీఈఓలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ప్లాంటేషన్, రెవెన్యూ విభాగాల్లో పనిచేసే స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్‌స్కిల్డ్ వర్కర్లకు వేతనాలతో పాటు రిస్క్ అలవెన్స్‌లు చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్‌మోహనరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు కోరారు. ఈ మేరకు జేసీ కార్తీక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, విజయనగరం నగర పాలక సంస్థలో థర్డ్ పార్టీ విధానం రద్దు చేయడంతో పాటు పంపుహౌస్ కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు ఎస్.రాజు, రామినాయుడు పాల్గొన్నారు.

కొనేముందు కంగారొద్దు..

- మారు అమ్మకం వాహనాలతో బహుపరాక్
- నిర్లక్ష్యం వహిస్తే చిక్కులే



విక్రయాలకు సిద్ధంగా ఉన్న సెకండ్ హ్యాండ్ వాహనాలు

విజయనగరం: ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ద్విచక్ర వాహనాల వినియోగం అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో వీటి వినియోగం కూడా గణనీయంగా పెరిగింది. ఆర్థిక స్థోమత కలవారు నూతన వాహనాలు కొనుగోలు చేస్తుండగా..సామాన్య వర్గాల వారు మాత్రం సెకెండ్ హ్యాండ్ వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. ఆ వాహనాలకే కొద్దిపాటి మరమ్మతులు చేపట్టి వినియోగించుకుంటున్నారు. సెకెండ్ హ్యాండ్ వాహనాల కోసం ప్రత్యేక షోరూమ్‌లు వెలిశాయి. ఇంతవరకు బాగానే ఉన్నా... సెకండ్ హ్యాండ్ ద్విచక్ర వాహనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకుంటున్నా చిక్కులు తప్పడం లేదు. ఇటీవల కాలంలో దొంగిలించిన బైకులను తక్కువ రేటుకు విక్రయిస్తున్న వ్యవహారం పట్టణంలో జోరుగా సాగుతోంది. తక్కువ రేటుకు వస్తుండడంతో చాలామంది కొనుగోలు చేస్తున్నారు. పోలీసుల తనిఖీల్లో ఆ వాహనం దొంగిలించినదని గుర్తించిన తర్వాత అవాక్కవుతున్నారు. వాహనాలతో పాటు సెల్‌ఫోన్లను కూడా ఇలానే విక్రయించేస్తున్నారు.

వీటిని సరి చూసుకోండి..

- పాత వాహనాలు కొనుగోలు చేసేవారు దానికి సంబంధించిన అసలు రిజిస్ట్రేషన్ కార్డు తీసుకోవాలి.
- కార్డుపై ఉన్న ఇంజిన్, చాసిస్ నంబర్లను మన దగ్గరకు వచ్చిన వాహనంపై ఉన్న సంఖ్యలతో సరిచూసుకోవాలి. వీటిలో తేడా ఉంటే అనుమానించాల్సిందే.
- అన్నీ సరిపోతే నగదు లావాదేవీలు పూర్తి చేసుకుని వాహనాన్ని తన పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

జోరుగా విక్రయాలు..

ఇటీవల కాలంలో సెకెండ్ హ్యాండ్ బైకుల అమ్మకాలు చురుగ్గా సాగుతున్నాయి. ఈ మేరకు కొందరు వ్యాపారులు ప్రత్యేకంగా సంస్థలు ఏర్పాటు చేస్తున్నారు. మరికొందరు వ్యక్తులు కూడా ఈ తరహా వ్యాపారం చేస్తున్నారు. అయితే అపరిచితుల వద్ద వాహనాలు కొనేముందు అప్రమత్తంగా లేకుంటే ఇక్కట్లు తప్పవంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు ఈ ఉచ్చులో ఎక్కువగా పడుతున్నారు. ఈ నేపథ్యంలో వాహనాలు కొనేముందు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

అప్రమత్తత తప్పనిసరి..

ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం వల్ల అన్ని రంగాల్లో బోగస్ రాజ్యమేలుతోంది. అసలుకు ఏ మాత్రం తేడా లేకుండా నకిలీ రిజిస్ట్రేషన్ కార్డు తయారు చేసే సౌకర్యాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. అసలు ధ్రువీకరణ పత్రాలు మాదిరిగా నకిలీవి కూడా ఉంటున్నాయి. అందుకే సీబుక్‌లో నంబర్లు సరిపోయినా ఓ మారు సరిచూసుకుని వాహన హక్కులను తమ పేరు మీదకు తక్షణమే బదిలీ చేయించుకోవాలి. ఇదిలాఉండగా ద్విచక్రవాహనంపై ఇంజిన్, చాసిస్‌పై సంఖ్యలనూ ట్యాంపరింగ్ చేసేవారు లేకపోలేదు. కాబట్టి కొనుగోలుదారులు అన్ని విషయాల్లోనూ అప్రమత్తంగా ఉండాలి.

ఆర్టీఏ కార్యాలయంలో సంప్రదించాలి..

పాత వాహనాలను కొనుగోలుచేసే ముందు వ్యక్తి నమ్మకస్తుడా కాదా అని చూసుకోవాలి. వాహనం అసలు సీబుక్‌ను చూసి దాని పై ఉన్న సంఖ్యలు వాహనంపై ఉన్న వాటితో సరిపోల్చుకోవాలి. లేకుంటే చిక్కులు తప్పవు. రవాణా శాఖ కార్యాలయంలో సంప్రదించి వాహన వివరాలు తెలియజేసి వారు ఓకే అన్న తర్వాత రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

– ఎ.జానీ, మెకానిక్, బాలాజీ జంక్షన్